క్లుప్తంగా

జోన్‌-2 పీజీఆర్‌ఎస్‌కు 18 అర్జీలు



జెడ్సీకి వినతి పత్రం అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

మధురవాడ: జీవీఎంసీ జోన్‌-2 మధురవాడ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు వివిధ సమస్యలపై 18 అర్జీలు అందినట్లు జోన్ కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి తెలిపారు. టౌన్‌ప్లానింగ్ 5, ఈఈ వర్క్స్ 2, వాటర్ సప్లై 4, రెవెన్యూ 3, ఎలక్ట్రికల్ 3, టౌన్ సర్వేయర్ విభాగానికి ఒక అర్జీ వచ్చిందన్నారు. నగరంపాలెం, రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని సీపీఐ నాయకులు కోరారు. వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతిరావు, ఈఈ శాంతిరాజు, ఏసీ నాగేంద్రకుమార్, సూపరింటెండెంట్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు తొమ్మిది వినతులు

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు తొమ్మిది వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి నాలుగు, ఇంజినీరింగ్ మూడు, ప్రజారోగ్యం, రెవెన్యూ విభాగాలకు ఒక్కో వినతి వచ్చింది. జోనల్ కార్యాలయం వద్ద పనిచేస్తున్న బీచ్ పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ భీమిలి జోన్ అధ్యక్షుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు జెడ్సీకి వినతి పత్రాన్ని అందించారు. వీటిపై ఆయన స్పందిస్తూ వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు.

ఉమా సిద్ధేశ్వరుడికి అభిషేకాలు



ఉమా సిద్ధేశ్వర స్వామి

పీఎం పాలెం: శ్రావణ మాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న శృంగేరీ శంకర మఠంలో కొలువైన ఉమా సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపారు. శ్రావణ మాస పూజాకార్యక్రమాల్లో భాగంగా మఠంలో కొలువుదీరిన ఉమాదేవికి, సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్‌షెడ్ వద్దనున్న కాశీ ఉమా మహేశ్వర ఆలయంలో కూడా ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. వందలాది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

అనంతుని ఆలయ పరిసరాలు పరిశుభ్రం



అనంత పద్మనాభ స్వామి ఆలయం చుట్టూ తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

పద్మనాభం: పద్మనాభంలోని గిరిపై వెలసిన అనంత పద్మనాభస్వామి ఆలయ పరిసరాలను సోమవారం పరిశుభ్రం చేశారు. ఆలయం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. మెట్లకు ఇరు వైపులా ఉన్న మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టారు.

అలరించిన పౌరాణిక వేషధారణ పోటీలు



వేషధారణ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో సోమవారం బాలబాలికలకు నిర్వహించిన పౌరాణిక వేషధారణ పోటీలు ఆకట్టుకున్నాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీరాధా మదన్ మోహన్ మందిరంలో ఈ నెల 2 నుంచి 11 వరకు జరగనున్న అతి పెద్ద సాంస్కృతిక కార్నివాల్‌లో భాగంగా ఈ పోటీలు జరిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పౌరాణిక పాత్రలకు తగ్గట్టుగా చిన్నారులు పద్యాలు చెపుతూ హావభావాలతో అలరించారు. అనంతరం భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. కార్నివాల్‌లో పాల్గొనదలచినవారు 99853 64430, 87901 60232 నంబర్లలో సంప్రదించాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస కోరారు.

రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్ గేమ్స్



పాండ్రంగి వెళ్లే మార్గంలో రహదారిపై ధూళి

మరమ్మతులకు నోచుకోని సంగివలస శివాలయం రోడ్డు

ఆరు నెలల కిందట రూ.కోటితో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా

- రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలంటున్న కాంట్రాక్టర్
- ముందుకురాని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు
- దుమ్ము, ధూళి, భారీ వాహనాలతో స్థానికులకు ఇబ్బందులు



రోడ్డుపై పాక్షికంగా పూడ్చిన గోతులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస శివాలయం రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోపాటు కాంట్రాక్టర్ గేమ్స్ కారణంగా స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల తర్వాత సుమారు కోటి రూపాయలతో ఈ రహదారి ఆధునికీకరణకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి ఆరు మాసాలు గడుస్తున్నా కాంట్రాక్టర్ పాక్షికంగా డెబ్రిస్‌తో గోతులు పూడ్చడం తప్ప మరో అడుగు ముందుకు వేయలేదు. ఈ మార్గం సంగివలస జాతీయ రహదారి నుంచి పురాతన శివాలయం మీదుగా భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాలను కలుపుతూ సింహాచలం – విజయనగరం రహదారిని కలుస్తుంది. ఈ మార్గంలో వందల సంఖ్యలో ఇటుక బట్టీలు ఉండడంతో నిత్యం భారీ వాహనాలతో ఇటుక తయారీకి అవసరమైన మట్టి, బొగ్గు, ఊక, కలప రవాణా జరుగుతుంది. అలాగే పదుల సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా తాగునీటి అక్రమ రవాణా 24 గంటలూ జరుగుతుంది. ఇక వివిధ విద్యా సంస్థలకు చెందిన వాహనాల రాకపోకలు సరేసరి. ఈ వాహనాల రద్దీ కారణంగా అసలే గోతులు పడిన రహదారి మరింతగా గోతులమయమైంది. అంతేకాకుండా రహదారి శిథిలాల నుంచి వెలువడే బూడిదతో ఇరువైపులా ఇళ్లు దుమ్ము కొట్టుకుపోయి చివరకు ఆహార పదార్థాలపై కూడా మట్టి పేరుకుపోతోంది. ఇలా ఏడాది కాలంగా ఈ రహదారికి ఇరువైపులా ఉన్న ప్రజలు ఆస్తమా, ఎలర్జీ, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. ఇక వర్షం కురిస్తే ఈ రహదారి పెద్ద చెరువులా మారిపోతుంది.



బ్రాహ్మణవీధిలో గోతుల మార్గం



రహదారి నిర్మాణానికి అడ్డంగా విద్యుత్ స్తంభాలు




శివాలయం వీధిలో రహదారి దుస్థితి

చలనం లేని కూటమి ప్రభుత్వం

ఈ రహదారిలో రోజూ రైతులు, బ్రాహ్మణులు, వ్యవసాయ కూలీలతోపాటు ఆలయాలకు వెళ్లే భక్తులు, బీసీ వెల్ఫేర్ కళాశాల వసతి గృహ విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. శిథిలమైన రహదారికి మరమ్మతులు చేయించాలని సాక్షాత్తూ కూటమి పార్టీల నాయకులే పలుమార్లు ఆందోళన నిర్వహించారు. వాహనాలను అడ్డుకున్నారు. ఇలా జరిగిన ప్రతీసారి జీవీఎంసీ అధికారులు వచ్చి సయోధ్య కుదుర్చుకోవడం అలవాటుగా మారింది. గతేడాది విజయదశమి, ఉప ఎన్నికలు, సంక్రాంతి ఇలా పలు సందర్భాలను సాకుగా చూపుతూ ఖచ్చితంగా రహదారిని ఆధునీకీకరిస్తామని వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉన్నాయని... వాటిని తొలగిస్తే తప్ప ముందుకు వెళ్లలేమని కాంట్రాక్టర్ కొర్రీ పెట్టడం గమనార్హం. రేపు, మాపు అంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు ముఖం చాటేస్తుండడంతో రహదారి నిర్మాణ పనులు అలాగే నిలిచిపోయాయి. ప్రస్తుతం గోతుల మార్గంలో ప్రయాణం కారణంగా చిన్న వాహనాలు బోల్తా పడటం, వర్షం కురిస్తే నీరు గోతులలో నిలిచిపోతున్నాయని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తప్పదని సంగివలస గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

గత ప్రభుత్వం రోడ్లు నిర్మించలేదన్నారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్లు నిర్మించకపోవడంతో అభివృద్ధి నిలిచిపోయిందని హేళన చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడచినా ఈ కొద్దిపాటి రహదారి నిర్మాణం పూర్తి చేయలేకపోతున్నారు. ప్రజాప్రతినిధుల మాటంటే అధికారులకు లెక్కలేదు. కూటమి ప్రభుత్వంలో వారే ఆందోళన చేస్తున్నా స్పందన శూన్యం.
– జోసఫ్ జేమ్స్, చిట్టివలస

ఒళ్లు హూనం అవడం ఖాయం



సంగివలస మీదుగా భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు ద్విచక్ర వాహనాలు, ఆటోలపై రాకపోకలు సాగించేవారు గోతుల మార్గం కావడంతో ఒళ్లు హూనం అవుతుంది. దీనికితోడు అక్రమంగా నీటి రవాణా, భారీ వాహనాల రాకపోకలతో ఉన్న రోడ్డు కూడా శిథిలమవుతోంది. – పిల్లా రాజేష్, తగరపువలస

వ్యాధుల బారిన పడుతున్నాం



సంగివలస జాతీయ రహదారి నుంచి కేవలం 300 మీటర్ల వరకు రోడ్డు అత్యంత ఘోరంగా ఉంది. ఇళ్లు, ఆలయాలపై దట్టంగా మట్టి పేరుకుపోతుంది. భోజనం చేసే సమయంలో కూడా ఈ రేగిన మట్టి వాటిపై పడుతోంది. ప్రస్తుతం పదుల సంఖ్యలో ఆస్తమా, శ్వాసకోశ వ్యాధి బాధితులు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. రహదారి నిర్మాణమే దీనికి పరిష్కారం. – కుంచం రమణ, కొత్తపేట

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాత బాల ఆదిత్యరెడ్డికి బాండ్ అందిస్తున్న ఈవో త్రినాథరావు



చెక్కు అందిస్తున్న దాత సూర్యప్రకాశరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి తగరపువలసకు చెందిన ఉప్పాడ బాల ఆదిత్యరెడ్డి రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో మంగళవారం అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ఈవో వి.త్రినాథరావు బాండ్ అందించారు. అలాగే నగరంలోని మహారాణిపేటకు చెందిన కె.సూర్యప్రకాశరావు, శ్రీలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని చెక్కురూపంలో పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు. కార్యక్రమంలో పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

అది ప్రభుత్వ భూమే..!

ప్లాన్ రద్దు చేస్తామంటున్న ఏసీపీ



లే అవుట్ మిగులు భూమిలో నిర్మించిన భవనాన్ని పరిశీలిస్తున్న వీఆర్వో



సాక్షి
రూ.1.7 కోట్ల భూమికి ఎసరు!

సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నెం.301 షిప్‌యార్డు లే అవుట్ బింద్రానగర్‌లో తప్పుడు పత్రాలు సృష్టించి భవన నిర్మాణం చేపట్టిన స్థలం ప్రభుత్వానిదేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. రూ.1.7 కోట్ల విలువైన 267 చ.గ. స్థల ఆక్రమణపై ఈ నెల 1న 'రూ.1.7 కోట్ల భూమికి ఎసరు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం సదరు స్థలాన్ని ఆర్ఐ కిషోర్ ఇతర అధికారులు పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ ఇది లే అవుట్‌లోని భూమి కాదని, ఓపెన్ స్పేస్ అని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు పేర్కొన్నారు. దీనిపై సర్వేయర్ రిమార్క్స్ తీసుకుని, ల్యాండ్ గ్రాబింగ్ కింద చర్యలు చేపడతామన్నారు.

ప్లాన్ రద్దుకు చర్యలు

ప్రభుత్వ భూములు రక్షించేస్తామని తెగ ప్రకటనలు ఇచ్చే జీవీఎంసీ అధికారులు మాత్రం ఈ వ్యవహారంలో నిదానంగా స్పందిస్తున్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు నిలుపుదల చేశామని, ప్లాన్ రద్దుకు చర్యలు చేపడతామని ఏసీపీ తిరుపతిరావు చెప్పారు. నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్ సీపీ సమావేశానికి తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

తగరపువలస: బీచ్‌రోడ్డులోని ఎస్‌ఓఎస్ వద్ద సువేరా రిసార్ట్స్‌లో భీమిలి జోన్ 1, 2, 3, 4 వార్డులకు సంబంధించిన కార్యకర్తలు, నాయకులతో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ'పై ఈ నెల 6న నిర్వహించనున్న విస్తృతస్థాయి సమావేశానికి అందరూ తరలిరావాలని వైఎస్సార్‌సీపీ 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి కోరారు. భీమిలి రోడ్డులో నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అబద్ధాల హామీలతో అందలం ఎక్కిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా చతికిలబడిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, చంద్రబాబు మోసాలను కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలో పార్టీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు దిశానిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పీతల వెంకట అప్పారావు, చిల్ల సూర్యనారాయణ, నమ్మి మాధవ, వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, తోణంగి ఎల్లాజీ, పీతల రాజారావు, సరగడ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా జరిపారు. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

కాలువ సమస్య పరిష్కరిస్తాం

భీమునిపట్నం: భీమిలి ఆంజనేయస్వామి ఆలయం వద్ద కాలువ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని జెడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఆలయం వద్ద మురుగునీరు' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. ఇక్కడ పూడికలు తొలగించడానికి సిబ్బంది ప్రయత్నించినప్పటికీ వీలుపడలేదని తెలిపారు. పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడానికి ఇంజినీరింగ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

నేడు స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

భీమునిపట్నం: భీమిలిలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో మిగులు సీట్లకు మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలిపారు. ఇందులో కమర్షియల్ కంప్యూటర్ ప్రాక్టీస్(సీసీపీ), సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో నేరుగా ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఇందులో చేరేందుకు పాలిసెట్‌-2025 ప్రవేశ పరీక్ష రాయనివారు, టెన్త్ సప్లిమెంటరీలో పాసైన వారు కూడా అర్హులన్నారు. ఈ ప్రవేశాలు పొందిన వారికి ఫీజుల్లో ఎలాంటి రాయితీలు, స్కాలర్‌షిప్ సదుపాయం ఉందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు టెన్త్ మార్క్స్ లిస్ట్, పాలిసెట్ ప్రవేశ రాసి ఉంటే ర్యాంక్ కార్డు, టీసీ, కుల ధృవీకరణ పత్రం, 4వ తరగతి నుంచి 10వ తరగతివరకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ ఒరిజినల్స్‌తోపాటు, మూడు సెట్‌ల జెరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతోపా రూ 5,800 ఫీజుతో ఉదయం 9.30 గంటలకు కళాశాల వద్దకు హాజరు కావాలని కోరారు.

దూరదృష్టి లేక తాగునీటి ఇబ్బందులు



మాట్లాడుతున్న సీపీఐ భీమిలి కార్యదర్శి రాంబాబు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ప్రజలు తాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జెడ్సీ అయ్యప్పనాయుడు తక్షణమే పరిష్కరించాలని సీపీఐ భీమిలి ఏరియా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గుజ్జు రామునాయుడు భవన్‌లో వీరు మాట్లాడారు. ఇప్పటి వరకు వర్షాలు కురవని కారణంగా గోస్తనీ జలాలతోపాటు చాలా చోట్ల బోరుబావులు ఎండిపోయి ప్రజలు తాగునీటి అవసరాలకు కటకటలాడుతున్నారన్నారు. గోస్తనీ నది నీరు సముద్రంలో కలవకుండా పాత వంతెన, పూనిగట్టు వద్ద చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో గోదావరి జలాలు విశాఖ వస్తే వాటిని భీమిలి వరకు తీసుకురావాలని కోరారు. సరైన ప్రణాళికలు లేనందున తరచూ తాగునీటి సమస్యకు దొరికిపోతున్నామన్నారు. 30 ఏళ్ల నాటి ప్రణాళికలు ఇప్పుడు పెరిగే జనాభాకు ఏమాత్రం సరిపోవన్నారు. జీవీఎంసీ అధికారులకు దూరదృష్టి లేకపోవడంతోనే ప్రజలు ఇప్పుడు నీరు కొనుక్కుని తాగుతున్నారన్నారు. పుట్టగొడుగుల్లా వీధుల్లో వెలసిన వాటర్ ప్లాంట్‌లలో అనుమతి లేని వాటిని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, ముత్యాలరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

భీమునిపట్నం: తమకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు భీమిలిలోని శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వారికి తప్పనిసరిగా ప్రభుత్వం కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని, ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ఎస్.అప్పలనాయుడు, పి.సూర్యనారాయణ, నీలాతి రాము, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్ నాయకులు శ్రీదేవి, నరసయమ్మ, సుగుణ, సీత పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం



సంతపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో బాలింతలు

తగరపువలస: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారమని, అందులో వారికి కావలసిన పోషకాలు, విటమిన్లు, మినరల్స్, ప్రొటీన్లు లభిస్తాయని ఐసీడీఎస్ భీమిలి పీవో శ్రీదేవి అన్నారు. సోమవారం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేట(చాకలిపేట) అంగన్‌వాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్ట్, ఐసీడీఎస్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని బాలింతలకు పలు సూచనలిచ్చారు. తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి అత్యంత సురక్షితమన్నారు. తల్లిపాలు తాగే పిల్లలు ఎంత బరువు ఉండాలో అంతే ఉంటారన్నారు. వీరికి భవిష్యత్తులో ఒబెసిటీ, డయాబెటీస్ వంటి సమస్యలు వేధించవన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీలు శ్రీగౌరి, అన్నపూర్ణ, ఏఈవీ లక్ష్మి, గ్రామస్తులు మద్దిల సుబ్బారావు, దండి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా!

జీవీఎంసీ 7వ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ నేతల షెడ్ల నిర్మాణం



కార్‌షెడ్ జంక్షన్ వద్ద అనుమతుల్లేకుండా తుది దశకు చేరిన షెడ్ నిర్మాణం



మిథిలాపురి ఉడా కాలనీ రోడ్డులో నిర్మిస్తున్న భారీ షెడ్

మధురవాడ: ఖాళీగా స్థలం కనిపిస్తే చాలు టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వెయ్యి నివాసాలకు ఓ ప్లానింగ్ సెక్రటరీ ఉన్నా ఆక్రమణలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. వారికి అనుకులంగా ఉన్నవారైతే ఒక రూల్, ఇతరులకు మరో రూల్ అన్నట్టుగా ఉంది వీరి వ్యవహారం.

యథేచ్ఛగా అక్రమ షెడ్లు

- జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి ఉడా కాలనీ రోడ్డులో పిలకవానిపాలెం ఎదురుగా కూటమి నాయకుల అనుచరులు ఎటువంటి అనుమతుల్లేకుండా భారీషెడ్ నిర్మిస్తున్నారు.
- ఉడా కాలనీలోని ఓ చర్చి సమీపంలో కూడా భారీ షెడ్ వెలుస్తోంది. దీనికి కూడా ఎలాంటి నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.
- కార్‌షెడ్ జంక్షన్ వద్ద టీడీపీ నాయకులు మరో షెడ్ నిర్మిస్తున్నారు. ఇది దాదాపు పూర్తి కావచ్చింది. దీని గురించి ఆరా తీస్తే నిర్మాణం పూర్తయ్యాక అనుమతులు, వీఎల్‌టీ చెల్లింపులు చేస్తారని టౌన్‌ప్లానింగ్ అధికారులే సెలవిస్తుండటం గమనార్హం.

అందరిపట్లా ఇలానే వ్యవహరిస్తున్నారనుకుంటే పొరపాటే. కూటమి పార్టీల పెద్దల అక్రమాలకే జీవీఎంసీ అధికారులు కొమ్ముకాస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏఎంసీ ఛైర్మన్‌గా రామస్వామినాయుడు ప్రమాణం



ఛైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కురుమిన రామస్వామినాయుడు, సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. భీమిలి మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఛైర్మన్ రామస్వామినాయుడు మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలా మేలు జరిగేలా పని చేస్తామన్నారు. రైతుల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, మాజీ మంత్రి పడాల అరుణ, అధికారులు పాల్గొన్నారు.